సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 10 । మే । 2023



ఎన్ఎస్టీఎల్‌లో ప్రదర్శన

జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని ఎన్ఎస్టీఎల్‌లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. 8లో



వినతుల పరిష్కారమే..

ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా సీఎం జగన్.. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. 8లో



డ్యాన్స్ షో.. అదరహో

ఏయూ స్నాతకోత్సవ మందిరం వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ నర్సుల వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. 8లో

న్యూస్‌రీల్

12న జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 12న మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 15 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. ప్రజారోగ్య విభాగంలో వాహనాలు, మందులు, టీకాలు, కుక్కల ఆహారం, ఇతర ఖర్చులకు సంబంధించి (రూ.41.85 లక్షలు) పరిపాలన ఆమోదానికి చర్చకు రానుంది. సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డు బీటీ ప్యాచ్ పనులు, గాజువాక జోన్ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలో గల జీవీఎంసీ కల్యాణ మండపం లీజు, చేపల చెరువు, కొబ్బరి చెట్ల ఫలసాయం మూడేళ్ల లీజు, జోన్-2 పరిధి ముడసర్లోవ పార్కులో 2023-23 ఏడాదికి క్యాంటీన్, పార్కు ప్రవేశ రుసుం లీజుకిచ్చేందుకు సభ్యుల ఆమోదానికి చర్చకు రానుంది. అలాగే మధురవాడ రోజువారీ మార్కెట్, శనివారం వారపు సంత వర్తకుల నుంచి ఆశీలు వసూలు 2023-24 ఏడాదికి లీజుకిచ్చేందుకు చర్చకు రానుంది.

'దివ్యాంగుల' ప్రావిజినల్ మెరిట్ జాబితా విడుదల

ఏయూక్యాంపస్: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ నియామకాల ప్రావిజినల్ మెరిట్ జాబితా https://visakhapatnam.ap.gov.in/ లో అందుబాటులో ఉందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి తెలిపారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ విభాగంలో ఏడు ఉద్యోగాల భర్తీకి 2021-22లో నోటిఫికేషన్‌ను అనుసరించి మెరిట్ జాబితా సిద్ధం చేశామన్నారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించి.. అభ్యంతరాలుంటే ఈ నెల 22లోగా రాతపూర్వకంగా కార్యాలయంలో అందించాలన్నారు. సహేతుకం కాని అభ్యంతరాలపై ఎటువంటి చర్య తీసుకోమని స్పష్టం చేశారు. అభ్యంతరాలు పరిశీలించి తుది మెరిట్ జాబితా ప్రకటిస్తామన్నారు. బయట వ్యక్తుల మోసపూరిత మాటలు విని మోసపోవద్దని ఓ ప్రకటనలో సూచించారు.

రేపు సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మధురవాడ: ఉమ్మడి విశాఖ జిల్లా సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 11న శ్రీకృష్ణాపురం ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో జరగనుంది. ఈ సందర్భంగా బాల, బాలికలు, సీనియర్ మహిళా, పురుష జట్లను ఎంపిక చేస్తామని విశాఖ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమణ, సూర్యనారాయణ తెలిపారు. జూనియర్ జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొనే వారు 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండాలి. ఒరిజినల్ ఆధార్ కార్డుతో 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలకు హాజరు కావాలి. మరిన్ని వివరాలకు 98856 59016, 94929 00200, 96405 22141లో సంప్రదించవచ్చు.

చిన్నారులకు ప్రత్యేక యోగా శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు చిన్నారులకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు 9494401919, 9398019922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం : విజయవాడ డివిజన్, గన్నవరం-ముస్తాబాద్-గుణదల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల వల్ల ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. • ఈనెల 10,13,14 తేదీల్లో బయల్దేరే విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ నిడదవోలు, ఏలూరు మీదుగా కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. • ఈనెల 9,12,13 తేదీల్లో బయల్దేరే ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. • ఈనెల 12న బయల్దేరే టాటానగర్-ఎస్ఎంవీ బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. • ఈనెల 13న బయల్దేరే హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. • హతియాలో ఈనెల 9న బయల్దేరిన హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది.

ప్లస్-2పై స్పెషల్ ఫోకస్!

- ఇంటర్ ఫలితాలతో దిద్దుబాటు చర్యలు
- సబ్జెక్టు టీచర్ల భర్తీకి శరవేగంగా ఏర్పాట్లు
- అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు బొనాంజా
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 71 మందికి అవకాశం
- ఎంపికైన వారికి ఒక ఇంక్రిమెంట్

విశాఖ విద్య: ఉన్నత విద్యను చేరువలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటైన హైస్కూల్ ప్లస్ చదువులపై విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. 2022-23లో విద్యా సంవత్సరంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో తొమ్మిది చోట్ల హైస్కూళ్లనే జూనియర్ కాలేజీలు (హైస్కూల్ ప్లస్)గా గుర్తించి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులోకి తీసుకురాగా, తొలి ఏడాది 244 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఆయా హైస్కూళ్లలోనే అర్హత గల సబ్జెక్టు టీచర్లతో ఇంటర్ మొదటి సంవత్సరం పాఠ్యాంశాల బోధన సాగించారు. కానీ వీటిలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. తొమ్మిది హైస్కూల్ ప్లస్ నుంచి కేవలం 11 మంది విద్యార్థులే ఉత్తీర్ణులయ్యారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్లస్ టూ హైస్కూళ్లను ఉన్నతాశయంతో ఏర్పాటు చేసినందున, వీటి బలోపేతంపై దృష్టి సారించారు.

సబ్జెక్టు టీచర్ల నియాకమకం

హైస్కూల్ ప్లస్‌ను నిర్వహిస్తున్న చోట పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండేలా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. 2023-24 విద్యా సంవత్సరానికి ముందుగానే ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రభుత్వం 71 పోస్టులను మంజూరు చేసింది.



గోపాలపట్నం ప్లస్ టూ బాలికల హైస్కూల్

మంజూరైన పోస్టులు

తెలుగు	10	బోటనీ	10
ఇంగ్లిష్	10	జువాలజీ	10
గణితం	08	సివిక్స్	01
ఫిజిక్స్	10	ఎకనామిక్స్	01
కెమిస్ట్రీ	10	కామర్స్	01

మూడు జిల్లాల్లో ప్లస్ టూ స్కూళ్లు -13

విశాఖపట్నం జిల్లా

• గాజువాక జెడ్పీ హైస్కూల్ • గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ • మల్కాపురం జీవీఎంసీ పాఠశాల • గంగవరం జెడ్పీ హైస్కూల్ • రాంపురం జెడ్పీ హైస్కూల్ • సీతమ్మధార ఎన్ఎంసీహెచ్ఎస్ పీటీ కాలనీ స్కూల్

అనకాపల్లి జిల్లా

• కూండ్రం • పరవాడ • పాయకరావుపేట • యలమంచిలి జెడ్పీ హైస్కూళ్లు

అల్లూరి సీతారామరాజు జిల్లా

• అడ్డతీగల • దేవీపట్నం • రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలు

దరఖాస్తు చేసుకోండి



ప్లస్ టూ హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లుగా పనిచేసేందుకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి ఉండాలి. 10వ తేదీ సాయంత్రంలోగా విశాఖపట్నం డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలి.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

బోధన మెరుగుపడుతుంది



ఇంటర్ కోర్సుల ప్రాధాన్యత దృష్ట్యా నాణ్యమైన బోధన అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్లస్ టూ స్కూళ్ల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవటం వల్ల జిల్లా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది. సబ్జెక్టు టీచర్ల నియామకంతో బోధన మెరుగుపడుతుంది.

– రాయల సత్యనారాయణ, డీవీఈవో, విశాఖ జిల్లా

పీజీటీ ప్రమోషన్ ఇస్తే మరింత మేలు



ప్లస్ టూ హైస్కూళ్లను బలోపేతం చేసేలా ఉన్నతాధికారుల దృష్టి సారించటం శుభపరిణామం. పోస్టుగాడ్యుయేషన్ అర్హత గల స్కూల్ అసిస్టెంట్‌లకు శాశ్వత ప్రాతిపదికన పీజీటీగా ఉద్యోగోన్నతి కల్పిస్తే ఉపాధ్యాయ వర్గానికి మరింత మేలు చేసినట్లవుతుంది.

– ఇమంది పైడిరాజు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, విశాఖపట్నం

గ్రాఫ్టింగ్‌లో కొత్త పుంతలు!

- పండ్లు, పూలమొక్కల పెంపకంలో సాంకేతికత
- సహజత్వం కోల్పోకుండా అధిక దిగుబడులు
- సరికొత్త రంగుల పూలు సృష్టికి ప్రయత్నాలు
- ఉత్తరాంధ్రలో 300కి పైగా నర్సరీలు



స్టోన్ గ్రాఫ్టింగ్ విధానంలో మామిడికి అంటు కడుతున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: పండ్లు, పూలమొక్కల పెంపకంలో సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. గ్రాఫ్టింగ్ (అంట్లు కట్టే పద్ధతి) విధానం కొత్త పుంతలు తొక్కుతోంది. మొక్క కణజాలంతో మరో మొక్క నాడీ కణజాలం కలిసేలా అమర్చడాన్ని అంటు కట్టడంగా పేర్కొంటారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధారణంగా ఉద్యాన, వ్యవసాయ సంబంధ మొక్కలను వాణిజ్య పరంగా వ్యాప్తి చేయడానికి వినియోగిస్తారు. ఈ గ్రాఫ్టింగ్ ద్వారా పండ్లలో సహజత్వం, రుచి కోల్పోకుండా, అధిక దిగుబడులు సాధించడం విశేషం. అలాగే సరికొత్త రంగుల్లో పూలు పూయించేందుకు కూడా దోహదపడుతోంది. ఈ విధానంపై చిన్న చిన్న నర్సరీల నుంచే జనంలో అవగాహన పెంపొందించేందుకు కొంతమంది ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. మొక్కలను బట్టి వివిధ రకాలుగా గ్రాఫ్టింగ్ చేస్తారు. ఒక విధానంలో గింజ మొక్కను 'వీ' ఆకారంలో కత్తిరించి ఎంచుకున్న తల్లి మొక్క నుంచి తెచ్చిన కొమ్మను అమరుస్తారు. సాధారణంగా మామిడిని ఇతర రకాల్లో ఈ విధానాన్ని ఉపయోగించి అంట్లు కడతారు. అప్రోచ్ గ్రాఫ్టింగ్‌గా పిలిచే రెండో విధానంలో తల్లి మొక్కను నేలకు వంచి దాని వైల్డ్ మొక్కను అంటు కడతారు. గతంలో గులాబీ వంటి రకాలకు తొక్కుడు పద్ధతిలో అంట్లు కట్టేవారు. కొత్త టెక్నాలజీలో గులాబీ, మందార వంటి మొక్కలకు బడ్డింగ్ (చిగురించే) దశలో అంటు కట్టడం సత్ఫలితాలిస్తోంది. స్టోన్ గ్రాఫ్టింగ్ సాంకేతికతలో మామిడిలో నచ్చిన రకాన్ని అంట్లు కట్టే వీలుంది. దీనివల్ల ఆ అంటు కట్టిన మామిడికి కాసే పండు సహజత్వం కోల్పోకుండా, రుచి, పరిమాణంలో మార్పు లేకుండా ఉంటుంది. పైగా అధిక దిగుబడిని కూడా ఇస్తుంది. అంతేకాదు.. సాధారణ (టెంక) విధానంలో మామిడి మొక్కను వేస్తే ఐదారేళ్ల వరకు కాపునకు రావు. అదే ఈ టెక్నాలజీలో అయితే ఏడాదికే కాపు కొస్తాయి. మరోవైపు పాలినేషన్ విధానంలో పువ్వులు తమ సహజ రంగులకు బదులు ఆకర్షణీయమైన కొత్త రంగులతో పూస్తాయి. ఇంకా ఎడినియం వంటి మొక్కలకు బుల్లెట్ గ్రాఫ్టింగ్ విధానంలో అంటుకట్టే సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. ఇలా గ్రాఫ్టింగ్ విధానంలో వచ్చిన సరికొత్త టెక్నాలజీని ఇటు రైతులు, అటు యువతరానికి అందించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ కూడా సహకరిస్తోంది. మరోవైపు ఉత్తరాంధ్రలో గతంతో పోల్చుకుంటే నర్సరీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గతంలో 200 లోపున్న నర్సరీలు ఇప్పుడు 300కు పైగా చేరాయి. కొత్త సాంకేతికను వినియోగించుకుంటూ లాభపడుతున్న నర్సరీల నిర్వాహకులూ ఉన్నారు.

యువతను భాగస్వామ్యం చేస్తాం..



ఆసక్తి ఉన్న నర్సరీ రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయాలని ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. ఇందులోభాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రాఫ్టింగ్ టెక్నిక్స్ పెరటి తోటల పెంపకం అంశాల్లో నిరుద్యోగులకు, నర్సరీ యజమానులకు సాంకేతిక శిక్షణను అందజేస్తోంది. వీరు కొంతకాలం సాధన చేయడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందే వీలుంది. మంచి మొక్కల తయారీ, ఎక్కువ ఫలసాయం ఇచ్చే మొక్కల తయారీకి గ్రాఫ్టింగ్ మెళకువలు తెలియడం చాలా అవసరం.

– ఆకుల చలపతిరావు, అధ్యక్షుడు, ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్

నేడే పాలిసెట్

మురళీనగర్ : జిల్లాలో పాలిసెట్ నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు కోఆర్డినేటర్ కె.డి.వి.నరసింహారావు చెప్పారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఆయా కేంద్రాలకు చేరవేశారు. సీఎస్‌లు ఇందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. నగరంలో 11,798 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 7,125, బాలికలు 4,673 మంది ఉన్నారు. భీమిలి కోఆర్డినేటింగ్ కేంద్రం పరిధిలో ఏర్పాటు చేసిన 6 పరీక్ష కేంద్రాల్లో 950 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. వీరిలో బాలురు 574 మంది, బాలికలు 376 మంది ఉన్నారు. సాంకేతిక సమస్య కారణంగా కొత్తగా హాల్ టికెట్లు జారీ చేసిన 112 మంది కోసం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటరు నరసింహారావు తెలిపారు.



మర్రిపాలెం స్టెల్లామేరీస్ పాఠశాల కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పకడ్బందీ పర్యవేక్షణ : నగరాన్ని ఆరు రూట్లు, భీమిలిని ఒక రూట్‌గా ఏర్పాటు చేసి పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు విశాఖ జిల్లా పరిశీలకుడు ఎం.ఎ.వి.రామకృష్ణ చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా ఉంటుందన్నారు. జిల్లా కోఆర్డినేటరు నరసింహారావు, శ్రీకాకుళం కాలేజీ హెచ్‌సీఎంఈఎస్ గండి గోవిందనాయుడు, మెటలర్జీ హెడ్ డాక్టర్ రత్నకుమార్‌లతో కలిసి నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

అంకితభావంతో ప్రజలకు సేవ చేయండి

కలెక్టర్ మల్లికార్జున



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగులు నిజాయతీ, నిస్వార్థంగా, అంకిత భావంతో ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ మరణించిన 45 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన వారికి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన నియామకపత్రాలు అందించారు. జిల్లాలో 40 మందిని జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురిని ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 244 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత విద్యనభ్యసించాలని, ఉద్యోగంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది వేచి చూస్తున్నారని, క్లిష్ట సమయంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేసి.. ఉన్నతాధికారుల గుర్తింపు పొందాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న నగరంలో పర్యటించనున్న ప్రాంతాలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ మంగళవారం పరిశీలించారు. క్రికెట్ స్టేడియం, అపోలో ఆస్పత్రి, సీ హారియర్ మ్యూజియం, నేషనల్ హైవే రోడ్లు, ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు, బ్యానర్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు, సెంటర్ మీడియన్లలో పిచ్చి మొక్కలను తొలగించి అందంగా తీర్చిదిద్దాలన్నారు. అదనపు కమిషనర్లు డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా నుంచే గంజాయి

- విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు రవాణా
- వినియోగం నుంచి విక్రయం వరకు నిఘా
- తరచూ దాడులతో పెరుగుతున్న కేసులు
- పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ వెల్లడి
- గంజాయి నియంత్రణపై విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీల సమీక్ష

దొండపర్తి: 'ఒడిశా నుంచి.. రోడ్డు, రైలు, జల రవాణా సదుపాయాలు ఉన్న విశాఖ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా అవుతోంది. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సప్లయ్ చైన్‌పై పోలీసుల డేగ కన్ను ఉంది. ఇందుకోసం పక్క రాష్ట్రాల పోలీస్ అధికారుల సమన్వయంతో అనేక మంది విక్రయదారులను అరెస్టు చేశాం. గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయడంతో పాటు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తాం' అని నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ స్పష్టం చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో విశాఖ రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలతో డీఐజీ హరికృష్ణతో కలిసి ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణపై సీపీ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో గంజాయి సాగుకు అవకాశం లేదని తేల్చి చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్, ఇతర ప్రాంతాల్లో గంజాయి సాగు చేసి.. అక్కడి నుంచి అనేక మార్గాల్లో విశాఖకు తీసుకువచ్చి.. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై గట్టి నిఘా పెట్టినట్లు చెప్పారు. కేవలం వినియోగదారులను పట్టుకోవడమే కాకుండా వారికి ఎవరు విక్రయించారు? ఎలా వచ్చింది? ఇలా మొత్తం సప్లయ్ చైన్ లింక్‌పై దృష్టి పెడుతున్నామని వివరించారు. ఇటీవల పెందుర్తిలో పట్టుకున్న 450 కిలోల గంజాయి కేసులో అసలు సూత్రధారి కోరాపుట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు. విశాఖ మీదుగా ఢిల్లీకి తీసుకువెళ్లే ప్రయత్నంలో వారిని పట్టుకున్నట్లు వెల్లడించారు.

గట్టి నిఘాతోనే పెరుగుతున్న కేసులు

గట్టి నిఘా పెట్టి విస్తృతంగా తనిఖీలు చేస్తున్న కారణంగానే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని సీపీ తెలిపారు. ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గంజాయి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీని కారణంగానే 2021లో 221 కేసుల్లో 2,700 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. 2022లో 255 కేసుల్లో 6,200 కేజీలు, ఈ ఏడాది నాలుగు నెలల్లో 88 కేసుల్లో 382 మందిని అరెస్టు చేసి 1,800 కిలోల గంజాయిని సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి వచ్చి హోటళ్లలో బస చేసే వారిపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. హోటళ్లలో బస చేసే వారు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని.. నగరంలోని 510 హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. 165 ట్రాన్స్‌పోర్టు సంఘాలకు నోటీసులివ్వగా.. ఓ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ ప్రతినిధి ఇచ్చిన సమాచారంతోనే 40 కిలోల గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి వినియోగంచడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువత, విద్యార్థులకు తెలియజేస్తూ.. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీఐజీ హరికృష్ణ, విశాఖ రేంజ్ పరిధిలోని ఎస్పీలు

అల్లూరి జిల్లాలో నియంత్రణలో గంజాయి సాగు

గంజాయి సాగు జరిగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఐజీ హరికృష్ణ తెలిపారు. 2021లో పరివర్తన కార్యక్రమం ప్రారంభించిన తర్వాత గంజాయి సాగు నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అప్పట్లో ఆ జిల్లాలో సాగైన 7,515 ఎకరాలను గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. గంజాయి సాగు కారణంగా కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించినట్లు చెప్పారు. గంజాయి సాగును పూర్తిగా నియంత్రించేందుకు ఇంటెలిజెన్స్ నుంచే కాకుండా శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా గుర్తించి 1,039 ఎకరాలను ధ్వంసం చేశామన్నారు. ప్రస్తుతం అల్లూరి జిల్లాలో గంజాయి సాగు దాదాపుగా నియంత్రణలోకి వచ్చినప్పటికీ.. ఒడిశా నుంచి అల్లూరి జిల్లా మీదుగా గంజాయి రవాణా అవుతున్న విషయాన్ని గుర్తించామన్నారు. దీంతో ఆ రాష్ట్ర పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆరుగురు వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. గంజాయి రవాణా, వ్యాపారులకు సంబంధించి సమాచారాన్ని తెలియజేసేందుకు 14500 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందన్నారు.

అనకాపల్లి జిల్లాలో నాలుగు చెక్‌పోస్టులు

అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ గంజాయి రవాణా నియంత్రణ కోసం 24 గంటలు తనిఖీ చేసేందుకు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గతేడాదిలో 224 కేసుల్లో 521 మంది అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో 217 మందిపై సస్పెక్ట్, రౌడీషీట్లు తెరిచామన్నారు. అల్లూరి సీతారామరాజు ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు పూర్తి అదుపులో ఉందన్నారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రోత్సహించేందుకు అవసరమయ్యే విత్తనాలు అందించే విషయమై.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పార్వతీపురం మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ కోరాపుట్, రాయగడ్ నుంచి గంజాయి రవాణా అవుతోందన్నారు. ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో కేవలం 8 మంది వినియోగదారులను గుర్తించామన్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా నియంత్రణ కోసం ఇచ్ఛాపురం, ఆముదాలవలస ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. విజయనగరం ఎస్పీ ఎం.దీపిక మాట్లాడుతూ 19 కేసుల్లో 46 మంది స్థానిక గంజాయి వ్యాపారులను అరెస్టు చేసినట్లు వివరించారు. జిల్లాలో 4 స్టాటిక్, 7 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ నిఘా పెట్టినట్లు చెప్పారు.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

గంజాయిని రెగ్యులర్‌గా రవాణా, వ్యాపారం చేసే వారి జాబితాను సిద్ధం చేశామని సీపీ తెలిపారు. వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. వీరిలో కొంత మంది జైలులో ఉన్నారని, వారు బయటకు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ఒడిశా నుంచి విశాఖకు గంజాయి రాకుండా.. అవసరమైన అన్ని ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు.

వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, సీపీ త్రివిక్రమ్ వర్మ, ఏసీఏ కార్యదర్శి గోపినాథ్

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ స్టేడియం ఆవరణలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను మంగళవారం అధికార యంత్రాంగం సమీక్షించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 11న స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఏపీఎల్ రెండో సీజన్ లోగో విడుదలతో పాటు ఆంధ్రా తరపున భారత్‌కు ఆడిన ఇద్దరు క్రీడాకారిణులకు నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. సమీక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ కౌన్సిల్ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాక నేడు

మద్దిలపాలెం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని బుధవారం నగరానికి రానున్నారు. న్యూఢిల్లీలో ఉదయం 6 గంటలకు బయలు దేరి 8.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల వరకు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 6.30 గంటలకు విశాఖ విమానాశ్రయంలో బయలుదేరి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

ఆకట్టుకున్న నమూనాలు



టార్పిడో పనితీరును వివరిస్తున్న శాస్త్రవేత్తలు



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని ఎన్‌ఎస్‌టీఎల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మానసి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు జ రగనున్న ఈ వైజ్ఞానిక ప్రదర్శనను ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. నగరంలోని పలు ఇంజినీరింగ్, ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. వీటిని ఆయన ఆసక్తిగా తిలకించి.. విద్యార్థులను అభినందించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. తాము చేసిన ప్రయోగాలను ఇక్కడ ప్రదర్శించడం ఆనందంగా ఉందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. తమ ఆలోచనలను మరొకరితో పంచుకునే అవకాశం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు 10 పాఠశాలలు, 12 కళాశాలల నుంచి మొత్తం 91 నమూనాలు దరఖాస్తు చేయగా.. 43 నమూనాలను ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు 11న బహుమతులు ప్రదానం చేయనున్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో ఓపెన్ హౌస్ : ఎగ్జిబిషన్‌లో భాగంగా ఎన్‌ఎస్‌టీఎల్ ప్రత్యేక విభాగంలో.. ఎన్‌ఎస్‌టీఎల్ ఉత్పత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి.. ఇక్కడ పలు ఆయుధాలు, వాటి పనితీరును తెలుసుకున్నారు.

వరుణాస్త్ర: నావికాదళ అమ్ముల పొదిలో దివ్యాస్త్రం..వరుణాస్త్రం. దీన్ని ఎన్‌ఎస్‌టీఎల్ ప్రత్యేకంగా రూపొందించింది. ఇది అండర్ వాటర్ వెపన్. భారీ లక్ష్యాన్ని ఛేదించగలదు. దీనిని విశాఖ, చెన్నై ఐఎన్‌ఎస్‌లకు అందించారు.

డెకాయ్: తరుముకొచ్చే ప్రమాదాన్ని ఇది తెలివిగా దారి మళ్లిస్తుంది. శత్రు టార్పిడోల లక్ష్యాల దిశ మార్చుతుంది. డెకాయ్‌లు రెండు రకాలు. మారీచ్, మోహినిగా నామకరణం చేశారు.

అటానమస్ అండర్ వాటర్ వెహికల్ : సముద్ర గర్భంలో 400 మీటర్ల వరకు వెళ్లగలదు. ఆయా ప్రాంతాల్లో ఉన్న మైన్స్‌ను కనుగొని సమాచారాన్ని అందిస్తుంది. ఇది శత్రువుల కంట పడకుండా తన పనిని చక్కపెడుతుంది. దీన్ని మరింత అభివృద్ధి చేశారు. సముద్రంలో 15 రోజుల పాటు ఉండి పూర్తి వివరాలు సేకరిస్తుంది. త్వరలో దీన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

మైన్ : నీటిలో కనీ కనబడనట్లు తేలియాడే ఆయుధం ఇది. ఆదమరిస్తే శత్రు నావను నాశనం చేయ గల ప్రభావవంతమైన అస్త్రమిది.

రాకెట్: ఎన్‌ఎస్‌టీఎల్ రూపొందించిన రాకెట్ అత్యంత వేగంగా వెళ్లి స్పష్టమైన లక్ష్యంలో పని పూర్తి చేస్తుంది. ఈ రాకెట్ ప్రదర్శనకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నర్సుల డ్యాన్స్ షో.. అదరహో

- ముగిసిన అంతర్జాతీయ నర్సుల వారోత్సవాలు
- క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం













డ్యాన్సులతో అదరగొట్టిన నర్సింగ్ విద్యార్థినులు



బహుమతులు అందిస్తున్న ఆచార్య సుశీల

ఏయూక్యాంపస్: ఏయూ స్నాతకోత్సవ మందిరం వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ నర్సుల వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు నర్సింగ్ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అదరగొట్టేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నర్సెస్, మిడ్‌వైవ్స్ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివన్నారు. సమాజంలో ఎంతో ప్రత్యేకత, గుర్తింపు, గౌరవాన్ని తీసుకొచ్చే వృత్తుల్లో నర్సింగ్ ఒకటిగా నిలుస్తుందన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ వృత్తిలో విశిష్ట గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఉదయం జరిగిన కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కోవిడ్ విజృంభించిన సమయంలో నర్సింగ్ సిబ్బంది సేవలు ఎనలేనివన్నారు. ఏపీఎస్ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ సునీత రెడ్డి, కార్యదర్శి పి.సునీల్, కోశాధికారి లక్ష్మీ నరసింహం, సమన్వయకర్త ఎం.ప్రీతం లూక్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్సులతో అదరగొట్టేశారు

నర్సింగ్ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో పలు నర్సింగ్ కళాశాలల విద్యార్థులు అదరగొట్టారు. పలు సినీ గీతాలకు నృత్యం చేస్తూ అలరించారు. శాస్త్రీయ, జానపద, దేశభక్తి గీతాలకు నృత్యం చేసి అందరినీ మైమరపించారు. నర్సింగ్ సిబ్బంది ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ.. ప్రదర్శించిన స్కిట్లు ఆకట్టుకున్నాయి.

వినతుల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం



హాజరైన మేయర్ హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, వాసుపల్లి, కలెక్టర్ మల్లికార్జున, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

మహారాణిపేట: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం(1902కు కాల్ చేయండి) కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. సంతృప్తికరస్థాయిలో ప్రజా వినతుల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని, ప్రతీ వినతి పరిష్కారమయ్యే వరకు ట్రాకింగ్ ఉంటుందని సీఎం జగన్ తెలిపారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, కలెక్టర్ మల్లికార్జున, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

12న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), కె.సుధ (టెక్నికల్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో 362 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారని, ఆసక్తి గల అభ్యర్థులు ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 10గంటలకు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు సకాలంలో విద్యాకానుక

విశాఖ విద్య: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకాలంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. అక్కయ్యపాలెం మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోని ఎమ్మార్సీని మంగళవారం ఆమె పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్లు భద్రపరిచేందుకు ఎమ్మార్సీని స్టాక్ పాయింట్‌గా ఎంపిక చేసినందున, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.సువర్ణను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు, జగనన్న విద్యాకానుక కిట్‌లో గల వస్తువులు పాడవ్వకుండా భద్రపరిచేలా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

ఒకరికి కరోనా

మహారాణిపేట: జిల్లాలో మంగళవారం ఒక కరోనా కేసు నమోదైంది. గడిచిన 24 గంటల్లో 202 మందికి పరీక్షలు నిర్వహించగా.. ఒకరికి నిర్ధారణ అయింది. నలుగురు డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 15 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

కార్మికుడు కుప్పకూలి.. ప్రాణాలు వదిలె

- మైలాన్ పరిశ్రమలో ఘటన
- పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకారం



మృతుడి భార్యకు దహన ఖర్చులు అందజేస్తున్న దృశ్యం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని మైలాన్ పరిశ్రమలో కార్మికుడు మంగళవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక మండలం నారాయణపాలెం గ్రామానికి చెందిన ఎం.శ్రీను(42) ఫార్మాసిటీలో మైలాన్ పరిశ్రమ యూనిట్-9లో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటలకు విధులకు వచ్చిన శ్రీను కళ్లు తిరుగుతున్నాయని తోటి కార్మికులతో చెప్పిన వెంటనే కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న తోటి కార్మికులు యాజమాన్యానికి సమాచారం అందించడంతో మెరుగైన వైద్యం కోసం అతడిని అంబులెన్స్‌లో నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం యాజమాన్యం మృతదేహాన్ని బంధువులకు అప్పగించింది. శ్రీను మృతిపై నారాయణపాలెంలో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. మృతుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.5.50 లక్షలతో పాటు రూ.4 లక్షల గ్యాట్యూటీ, దహన సంస్కారం కోసం రూ.50 వేలు తక్షణమే చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ చెప్పారు. అలాగే మృతుడి భార్యకు పరిశ్రమలో ఉపాధి, ప్రతి నెల పెన్షన్ రూపంలో రూ.15 వేలు చెల్లించనుందని తెలిపారు. ఈ చర్చల్లో ఎంపీటీసీ ఎ.నాగేశ్వరరావు, యాజమాన్య ప్రతినిధి అరవింద్ పాల్గొన్నారు. కాగా కార్మికుడు శ్రీను మృతిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.

ప్రియురాలి మెడలో చైన్ కాజేయబోయి..

కటకటాలపాలైన ప్రియుడు, అతని స్నేహితులు

ఉక్కునగరం: ప్రియురాలి మెడలో బంగారు చైన్ కాజేయబోయి ప్రియుడు, అతని స్నేహితులు కటకటాలపాలైన ఘటన స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పరవాడకు చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అమ్మాయి, గోపాలపట్నం చెందిన లంక జయవర్ధన్ (20) ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఆమె మెడలోని తులం బంగారు చైన్‌పై జయవర్ధన్ కన్నుపడింది. సోమవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు ఆమెను రమ్మన్నాడు. లూథరన్ చర్చి సమీపంలో వారిద్దరు కలుసుకున్నారు. కొంతసేపటికి రామాటాకీస్ వెనుక ఉంటున్న ఇంటర్ విద్యార్థి పెదిరెడ్ల దినేష్ (17), చినవాల్తేరు చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి మణికొండ సాయితేజ (20) బైక్‌పై వచ్చి వారిని బెదిరించి ఆమె మెడలో చైన్‌ను పట్టుకుపోయారు. ఆ అమ్మాయి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో క్రైం ఎస్ఐ శ్రీనివాసరావు బృందం అక్కడకు చేరుకొని గాలించగా ఒకరు పట్టుబడగా, ఇంకొకరు పారిపోయారు. అతన్ని విచారించి రెండో వ్యక్తిని పట్టుకున్నారు. వారిద్దరిని విచారించగా జయవర్ధన్ మోసం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి వద్ద హాజరుపర్చగా, వారికి రిమాండ్ విధించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మేహాద్రిగెడ్డలో దూకి ఒకరి ఆత్మహత్య



హేమంత్‌కుమార్ మృతదేహం

సింహాచలం: మద్యానికి బానిసై.. అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి మేహాద్రి గెడ్డ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పెందుర్తి ఎస్ఐ అసిరి తాత తెలిపిన వివరాలివీ.. నగరంలోని బాజీ జంక్షన్‌కు చెందిన ప్రకారం హేమంత్‌కుమార్(38) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హేమంత్ మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం కూడా దెబ్బతింది. దీనికి తోడు అప్పులు ఎక్కువగా ఉండటంతో ఇంట్లో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ తరుణంలోనే ఈ నెల 7న సాయంత్రం ఇంటి నుంచి బైకుపై మేహాద్రి గెడ్డ వద్దకు వెళ్లాడు. కాగా.. గెడ్డ పరిసరాల్లో బైకు, బైకు వద్ద చెప్పులు, సెల్‌ఫోన్ ఉండటాన్ని సోమవారం చూసిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు సెల్‌ఫోన్ సహాయంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈతగాళ్లతో చెరువులో గాలించారు. కానీ ఎంతకీ ఆచూకీ తెలియలేదు. మంగళవారం మధ్యాహ్నం హేమంత్‌కుమార్ మృతదేహం చెరువులో తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోధన నైపుణ్యం మెరుగు పరచుకోవాలి

ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు



మాట్లాడుతున్న మాణిక్యం నాయుడు

విశాఖ విద్య: ఉపాధ్యాయులు బోధనలో నైపుణ్యం మెరుగుపరచుకోవాలని ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు సూచించారు. ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని వైఎంసీఏ హాల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు ఆయన పలు అంశాలపై ఉపాధ్యాయులకు వివరించారు. రాష్ట్ర స్థాయి ఇంట్రడక్షన్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి 13 జిల్లాల నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టు కోసమని ఎంపికైన డీఆర్పీలు దీనిలో పాల్గొన్నారు. వృత్తి నైపుణ్యతను పెంచుకోవడం ద్వారానే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించే అవకాశం ఉంటుందని మాణిక్యం నాయుడు అన్నారు. డైట్ కళాశాలను ఇంగ్లిష్ సబ్జెక్టుపై శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేయటాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామన్నారు. 1998 నుంచి ఇటీవల డీఎస్సీ వరకు ఎంపికైన ఉపాధ్యాయులకు సబ్జెక్టుల్లో విషయ నైపుణ్యతను పెంచేందుకు ఇది దోహద పడుతుందన్నారు. ఇక్కడ తర్ఫీదు పొందిన డీఆర్పీలు ఈ నెల 15 నుంచి జూన్ 9 వరకు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. డైట్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు గొట్టేటి రవి, అల్లా ఉద్దీన్, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్లు అనిత తదితరులు పాల్గొన్నారు.